

కోమల్ల టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులు

## మొరాయించిన ఫాస్టాగ్

**కోమల్ల టోల్‌గేట్ వద్ద నిలిచిపోయిన పది ఆర్టీసీ బస్సులు**

రఘునాథపల్లి, డిసెంబర్ 15 : ఆర్టీసీ బస్సుల్లో ఫాస్టాగ్ పనిచేయక పోవడంతో హైదరాబాద్–వరంగల్‌కు వెళ్లే బస్సులు మండలంలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద నిలిచిపోయాయి. బస్సు డ్రైవర్స్, కండక్టర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఫాస్టాగ్ పనిచేయలేదు. దీంతో బస్సులను టోల్‌గేట్ వద్ద నిలిపివేశారు. ఫాస్టాగ్ స్కాన్ కాకపోవడంతో పలు డిపోల ఆర్టీసీ బస్సులు టోల్‌గేట్ వద్ద సుమారు అర్ధగంటకు పైగా నిలిచిపోయాయి. వరంగల్ రీజినల్ పరిధిలోని వరంగల్–1, వరంగల్–2, జనగామ, పరకాల, భూపాలపల్లి, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరుకు చెందిన సుమారు 12 బస్సులు టోల్‌గేట్ వద్ద ఆగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సుమారు 40 నిమిషాల అనంతరం ఫాస్టాగ్ సపోర్టు చేయడంతో బస్సులు బయలుదేరాయి.

# మా కుటుంబాలు బతికేదెట్లా?

- **జీవనోపాధి కోసం తాళిబొట్లు అమ్మి ఆటోలు కొనుక్కున్నాం**
- **మహిళలకు ఫ్రీ బస్సుతో గిరాకీ లేక రోడ్డున పడ్డాం**
- **మాకు బతుకుదెరువు చూపించాలి**
- **స్టేషన్ ఘన్‌పూర్‌లో ఆటోడ్రైవర్ల ఆందోళన**



స్టేషన్ ఘన్‌పూర్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 15 : భార్య తాళిబొట్లు అమ్ముకుని ఆటో కొనుక్కొని జీవితాన్ని నెట్టుకొస్తున్నామని, మహిళలకు బస్సుల్లో ఫ్రీ టికెట్ కల్పించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, సీఎం రేవంత్ రెడ్డి దారి చూపాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూర్ మండలాల ఆటోడ్రైవర్లు గాంధీ చౌరస్తా నుంచి జాతీయ రహదారి బస్టాండు వరకు ర్యాలీ తీసి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తీసి వేయాలని లేదా ఆటోడ్రైవర్లకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రజలను ఆదుకునేలా ఉండాలి కాని, ప్రజల పొట్ట కొట్టేలా ఉండొద్దన్నారు. ప్రజల చావుకు కారణమయ్యేలా నడుచుకునే ప్రభుత్వాలను ఎవరూ ఆదరించరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రోజుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు సంపాదించే వాళ్లమని.. ఫైనాన్స్, ఆటో టాక్స్, బండి రిపేర్లకు పోగా మిగిలిన డబ్బుతో కుటుంబం గడిచేదని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రోజుకు రూ.200 కూడా రావడం లేదని, ప్రభుత్వ ఉపాధ్యాయులు నెల వారీగా డబ్బులు చెల్లిస్తూ ఆటోల్లో ప్రయాణించేవారని, ఇప్పుడు వారు కూడా బస్సుల బాట పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆదాయం తగ్గిందని, ఇప్పుడు కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం గాని పరిస్థితుల్లో ఉన్నామని పేర్కొన్నారు. ఒక్క శివునిపల్లి గ్రామంలోనే రెండు వందల ఆటోలు ఉన్నాయని, పరువు పోయి ప్రాణాలను తీసుకునే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆటో యూనియన్ స్టేషన్ ఘన్‌పూర్ పట్టణాధ్యక్షుడు రాజారపు జయపాల్, అశోక్, యాదగిరి, కిషన్, రాజేశ్వర్‌రెడ్డి, వేణు, పాలకొండ మోహన్, అన్వర్, సమ్మయ్య, చేపూరి కుమార్ పాల్గొన్నారు.

# మహా జాతరకు రూ.75కోట్ల విడుదల

- **తాగునీరు, పారిశుధ్యానికి రూ.14.74కోట్లు**
- **పోలీస్ శాఖకు రూ.10.50కోట్లు**
- **కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతిపాదనలకు ఆమోదం**
- **శాఖల వారీగా నిధుల విడుదల**
- **మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు**

ములుగు, డిసెంబర్ 15 (నమస్తేతెలంగాణ) : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లను విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అధికారులు శాఖల వారీగా నిధులను ప్రతిపాదించగా వాటిని ఆమోదిస్తూ శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినాజడ్ చోంగ్తూ జీవో విడుదల చేశారు. కోటి మందికి పైగా భక్తులు హాజరయ్యే జాతరలో తాగునీరు, పారిశుధ్య పనులకు అత్యధికంగా రూ.14 కోట్ల 74లక్షల 90వేలను కేటాయించారు. భక్తుల భద్రత కోసం పోలీస్ శాఖకు రూ.10కోట్ల 50లక్షలు, రహదారుల మరమ్మతులు, నిర్మాణం కోసం రూ.2 కోట్ల 80లక్షలు, దేవాదాయ శాఖకు రూ.కోటీ50లక్షలు, పంచాయతీరాజ్ శాఖకు రూ.4కోట్ల 35లక్షలు, మైనర్ ఇరిగేషన్‌కు రూ.6కోట్ల 11లక్షల 70వేలు, వైద్య ఆరోగ్య శాఖకు రూ.కోటి, ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ శాఖకు రూ.8 కోట్ల 28లక్షల 85వేలు, విద్యుత్ శాఖకు రూ.3కోట్ల 96లక్షల 92వేలు, టీఎస్ ఆర్టీసీకి రూ.2కోట్ల 25లక్షలు, ఎక్సైజ్ శాఖకు రూ.20లక్షలు, సమాచార పౌర సంబంధాల శాఖకు రూ.50లక్షలు, పశు సంవర్ధక శాఖకు రూ.30లక్షలు, టూరిజం శాఖకు రూ.50లక్షలు, రెవెన్యూ శాఖకు రూ.5కోట్ల 25లక్షలు, జిల్లా పంచాయతీ అధికారికి శానిటేషన్ కోసం రూ.7కోట్ల 84లక్షల 97వేలు, మత్స్యశాఖకు రూ.24లక్షల 66వేలు, అగ్నిమాపక శాఖకు రూ.20లక్షలు, అటవీ శాఖకు రూ.20లక్షలు, ఐసీడీఎస్ విభాగానికి రూ.23లక్షలు, ట్రైబల్ డెవలప్‌మెంట్ విభాగంలో ఐటీడీఏ పీవోకు రూ.4కోట్లను విడుదల చేసినట్లు జీవోలో పేర్కొన్నారు. నిధులను జిల్లా కలెక్టర్ ద్వారా ఖర్చు చేయాలన్నారు.



## బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పరామర్శ

నర్సంపేట : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సందర్భంగా దవాఖానలో ఆయనను ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి కలిశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## విధుల్లో చేరిన ఎన్పీడీసీఎల్ సీఎండీ

- **నక్కలగుట్టలోని కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ**
- **వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి**
- **ఉద్యోగులకు నూతన సీఎండీ వరుణ్‌రెడ్డి పిలుపు**

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 15 : ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన కర్నాటి వరుణ్‌రెడ్డి గురువారం నక్కలగుట్టలోని కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయని, 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించాలని కోరారు. అందరూ కలిసికట్టుగా పని చేసి సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, గణపతి, సంధ్యారాణి, ఉద్యోగులు, సంఘాల నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ విప్‌గా రామచంద్రునాయక్

- **రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు జారీ**
- **ఉమ్మడి జిల్లాలో మరో ఎమ్మెల్యేకు పదవి**

నర్సింహులపేట, డిసెంబర్ 15 : డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్‌ను ప్రభుత్వ విప్‌గా సర్కారు శుక్రవారం నియమించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మరో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు పదవి దక్కడంతో ఆ పార్టీ డోర్నకల్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

# పారిశ్రామికరంగ అభివృద్ధికి పరిశోధనలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

- **అన్ని ఎన్‌ఐటీలతో కలిసి పనిచేసేందుకు వరంగల్ నిట్ సిద్ధం**
- **ఉమ్మడిగా కార్యాలయం ఏర్పాటుకు కృషి**
- **డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి**

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 15 : పారిశ్రామికరంగ అభివృద్ధికి పరిశోధనలను బలోపేతం చేస్తామని, ఇందుకోసం దేశంలోని అన్ని ఎన్‌ఐటీలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. దేశంలోని 31 ఎన్‌ఐటీలతో కలిసి పరిశోధనా సదస్సు నిర్వహించారు. అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ, హైదరాబాద్) డైరెక్టర్ నర్సింగరావు, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వీటీ సోమశేఖర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని ఎన్‌ఐటీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పరిశోధనలను మెరుగుపర్చేందుకు లక్ష్యం నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఏఆర్‌సీఐ డైరెక్టర్ మాట్లాడుతూ.. దేశం అత్యధిక నాలెడ్జ్ బేస్ ఐఐటీ, ఎన్‌ఐటీల్లోనే ఉందన్నారు. ప్రొఫెసర్ సోమశేఖర్ మాట్లాడుతూ.. ఉత్తమ అభ్యాసాల స్వీకరణ, ప్రభుత్వ సమస్యలు, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ స్టార్టప్ థీమ్‌లతో ప్యానెల్ సెషన్లను నిర్వహిస్తామన్నారు. పరిశోధన, అభివృద్ధి, వ్యవస్థను మరింత ఉత్పాదకంగా మార్చడానికి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం దీని లక్ష్యమన్నారు.

# కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- **మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకోని అధికారులు**
- **నిరసన వ్యక్తం చేసిన రైతులు**

నర్సింహులపేట, డిసెంబర్ 15 : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారమైనా అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బొజ్జన్నపేట గ్రామ శివారు బీమ్లాతండాలోని ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మరమ్మతులు చేయాలని అధికారులను కోరితే బిల్లులు మొత్తం చెల్లించాలన్నారు. దీంతో ఏడాది బిల్లు రూ. 500 చొప్పున 25 మంది రైతులు చెల్లించారు. అయినా విద్యుత్ అధికారులు మరమ్మతులు చేయించలేదు. ప్రస్తుతం మిరప తోటలకు నీరు పారించడం కష్టంగా ఉందని, కనీసం స్నానం చేసేందుకు బావి దగ్గర మోటర్ పెట్టుకునే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో రైతులు బానోత్ సర్వన్, వీరన్న, నర్సింగ్, మగ్త, సురేశ్ ఉన్నారు.



బీమ్లా తండాలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు